దుర్గమ్మ ... పాహిమాం

సత్తెనపల్లి: దేవి శరన్నవరాత్రి ఉత్సవాల్లో భాగంగా నియోజకవర్గంలో ఆధ్యాత్మిక శోభ నెలకొంది. పట్టణంలోని వాసవి కన్యకా పరమేశ్వరి దేవాలయం, త్రిశక్తి దుర్గాపీఠం, సనారి వీరబ్రహ్మేంద్ర ఆశ్రమం, వెంకటపతి కాలనీలోని నీలంపాటి లక్ష్మీ అమ్మవారి పీఠంలో అమ్మవారిని లలితా త్రిపుర సుందరీదేవిగా అలంకరించారు. కొత్తపేట మహాలక్ష్మమ్మ చెట్టు వద్ద, వడ్డవల్లి పోలేరమ్మ గుడిలో దుర్గాదేవిగా, సత్తెనపల్లి మండలం పెద్దమక్కెన గ్రామంలోని గంగా భ్రమరాంబ సమేత మల్లికార్జునస్వామి దేవాలయంలో అమ్మవారిని మహా మంగళ గౌరీదేవిగా అలంకరించి ఆయా ఆలయాల్లో విశేషంగా పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఆటంకం కలగకుండా ఆయా ఆలయ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

క్రోసూరు: దసరా శరన్నవరాత్రుల మహోత్సవాలు పురస్కరించుకుని క్రోసూరులోని వాసవీ కన్యకాపరమేశ్వరీ అమ్మవారు శనివారం శ్రీలక్ష్మీదేవీగా భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళలు వాసవీ అమ్మవారి బతుకమ్మ ఉత్సవాలు నిర్వహించారు. ఆలయ కమిటీ సభ్యులు భక్తులకు ఆలయంలో సకల ఏర్పాట్లు చేసారు. భక్తులు అశేషంగా పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

అచ్చంపేట: స్థానిక శ్రీవాసవీకన్యకాపరమేశ్వరి అమ్మవారి దేవస్థానంలో వాసవీమాత చండీదేవిగా శనివారం భక్తులకు దర్శనమిచ్చారు. ఆర్యవైశ్య మహిళా విభాగం ఆధ్వర్యంలో లలిత, కన్యకాపరమేశ్వరి అమ్మవారి సహస్ర, అష్టోత్తర శత నామ పారాయణం చేశారు. కార్యక్రమంలో నిర్వహకులు సూరే సుబ్బారావు పాల్గొన్నారు. సీతారామస్వామి దేవాలయంలో సీతామహాలక్ష్మి అమ్మవారు భక్తులకు ధాన్యలక్ష్మిగా దర్శనం ఇచ్చారు.



సత్తెనపల్లి త్రిశక్తి దుర్గాపీఠంలో లలితాత్రిపుర సుందరీదేవిగా..



క్రోసూరు వాసవీ కన్యకాపరమేశ్వరి..

రాజుపాలెం: స్థానిక అంకమ్మతల్లి అమ్మవారు మహంకాళీ అలంకారంలో భక్తులకు శనివారం దర్శనమిచ్చారు. దసరా శరన్నవరాత్రి వేడుకల్లో భాగంగా ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. అర్చకులు అర్వపల్లి కోటినారాయణ, అర్వపల్లి ఫణికుమార్ ఆధ్వర్యంలో అమ్మవారిని శ్రీమహంకాళీ రూపంలో అలంకరించారు. సమీప గ్రామాల నుంచి వచ్చిన భక్తులు విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకొని మొక్కులు చెల్లించారు.

నకరికల్లు: మండలంలో పలు గ్రామాల్లోని ప్రముఖ ఆలయాల్లో దేవీ నవరాత్రుల ఉత్సవాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. శనివారం అమ్మవారు విశేషమైన అలంకరణలో భక్తులకు దర్శనమిచ్చారు. కపోతేశ్వర స్వామి ఆలయంలో దుర్గాదేవి అలంకారం, నర్సింగపాడులోని మరకతలింగ చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో అన్నపూర్ణాదేవి అలంకారం, అన్నపూర్ణా సమేత కాశీవిశ్వేశ్వరస్వామి దేవస్థానంలో మహాలక్ష్మి అలంకారంలో అమ్మవారు దర్శనమిచ్చారు. విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్న భక్తులు మొక్కులు చెల్లించారు.

ప్రజారోగ్య సంరక్షణ ప్రభుత్వ ధ్యేయం

సత్తెనపల్లి: ప్రజారోగ్య సంరక్షణ ప్రభుత్వ ధ్యేయమని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి వైద్య రంగంలో విప్లవాత్మక మార్పులు తీసుకొచ్చి మారుమూల గ్రామాల ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందజేస్తున్నారని పలువురు పేర్కొన్నారు. సత్తెనపల్లి మండలం పాకాలపాడులో శనివారం జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరాన్ని సర్పంచి సుజాత లక్ష్మి ప్రారంభించారు. ఎంపీటీసీ కాల్వపల్లి రమేష్ రెడ్డి, మాజీ పీఏసీఎస్ అధ్యక్షుడు తిప్పిరెడ్డి హుస్సేన్ రెడ్డి, వైఎస్ఆర్ సీపీ నాయకుడు కళ్ళం హరనాథ్ రెడ్డి, ఎంపీడీవో జీవీ సత్యనారాయణ, తహశీల్దార్ ఎస్.సురేష్ మాట్లాడారు. ఈ సందర్భంగా డాక్టర్ ఎం.అనూష రాణి, డాక్టర్ పి.గౌతమి, డాక్టర్ నయోమి సురేఖ, డాక్టర్ రవిశంకర్ రెడ్డి 527 మందికి వైద్య పరీక్షలు నిర్వహించారు. 12 మందిని ఉన్నత ఆస్పత్రులకు మెరుగైన వైద్యం నిమిత్తం రిఫర్ చేశారు. 704 మందికి ల్యాబ్ పరీక్షలు నిర్వహించారు. 105 మందికి నేత్ర వైద్య పరీక్షలు నిర్వహించి 89 మందికి కళ్లజోళ్లు పంపిణీ చేశారు. ఏడుగురికి నేత్ర కాటరాక్ట్ వైద్య సేవల నిమిత్తం సిఫార్సు చేశారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో పోషకాహార ప్రదర్శనను నిర్వహించారు. ఐసీడీఎస్ సూపర్‌వైజర్ స్వర్ణలత, ఫణిదం ఎంపీహెచ్ఈఓ పిట్టల శ్రీనివాసరావు పాల్గొన్నారు.

పట్టణంలో..

జగనన్న ఆరోగ్య సురక్ష ప్రజలకు రక్ష అని మున్సిపల్ మేనేజర్ ఎస్.సాంబశివరావు అన్నారు. పట్టణంలోని 2,3 వార్డుల ప్రజలకు సుగాలి కాలనీ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో శనివారం నిర్వహించిన జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరంలో ఆయన పాల్గొని మాట్లాడారు. మేనేజర్ సాంబశివరావు మాట్లాడుతూ ప్రతి కుటుంబం ఆరోగ్యంగా ఉండాలన్నదే ప్రభుత్వం ధ్యేయంగా పెట్టుకుందన్నారు. జగనన్న ఆరోగ్య సురక్ష వైద్య శిబిరాలకు అపూర్వ స్పందన లభిస్తుందన్నారు. ఈ సందర్భంగా వైద్యులు డాక్టర్ ఎస్.సాయి తేజ రెడ్డి, డాక్టర్ జి.దర్మ సింగ్ శాస్త్రి, డాక్టర్ అక్షయ, డాక్టర్ సంకరి ప్రభ, డాక్టర్ పీఎంఓఏ 557 మందికి పరీక్షలు నిర్వహించారు. 39 మందికి నేత్ర పరీక్షలు చేశారు. 15 మందికి మలేరియా, ఈసీజీ పరీక్షలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసీడీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన అంగన్‌వాడీ పోషక ఆహార ప్రదర్శనను పరిశీలించి ముగ్గురికి వైఎస్ఆర్ పోషణ్ కిట్స్ పంపిణీ చేశారు. వైద్య పరీక్షలు చేయించుకున్న వారందరికీ అవసరమైన మందులను పంపిణీ చేశారు. మెరుగైన వైద్యం కోసం ఒకరిని జిల్లా వైద్యశాలకు రిఫర్ చేశారు.



పాకాలపాడులో పరీక్షలు చేస్తున్న సిబ్బంది

బుస్సాపురంలో..

పెదకూరపాడు: జగనన్న ఆరోగ్య సురక్షతో ఇంటి వద్దకే అన్ని వైద్య సదుపాయాలు అందుతున్నాయని ఎంపీపీ బెల్లంకొండ మీరయ్య అన్నారు. మండలంలోని బుస్సాపురం గ్రామంలో జగనన్న ఆరోగ్య సురక్ష శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. కార్యక్రమంలో మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు షేక్ మస్తాన్ షరీఫ్, సర్పంచి జయమ్మ, పాల్గొన్నారు.

సామాజిక న్యాయ బస్సు యాత్రను జయప్రదం చేద్దాం

మంత్రి అంబటి రాంబాబు

నకరికల్లు: ప్రభుత్వం చేపట్టిన, చేపడుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లాలని రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు అన్నారు. స్థానిక పార్టీ కార్యాలయంలో మండల కన్వీనర్ భవనం రాఘవరెడ్డి ఆధ్వర్యంలో పార్టీ సమావేశం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరంతరం ప్రజల్లో ఉండేందుకు వినూత్నమైన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈనెల చివరి నుండి వై ఏపీ నీడ్స్ జగన్, సామాజిక న్యాయ బస్సుయాత్ర కార్యక్రమాలు చేపట్టనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ మేచారపు అనూరాధ, జెడ్పీటీసీ సభ్యుడు జె.హరీష్, వైస్ ఎంపీపీలు మేడం ప్రవీణ్‌కుమార్‌రెడ్డి, దూదేకుల హుస్సేన్‌బి బాషా, పల్నాడు జిల్లా వాణిజ్యవిభాగం అధ్యక్షులు అచ్యుత శివప్రసాద్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి అంబటి రాంబాబు

అమరవీరుల త్యాగాలు మరువలేనివి

సత్తెనపల్లి: అమరవీరుల త్యాగాలు మరువలేనివని సత్తెనపల్లి రూరల్ ఎస్ఐ షేక్ అమీనుద్దీన్ అన్నారు. పోలీస్ అమరవీరుల సంస్మరణ దినాన్ని పురస్కరించుకొని చత్తీస్‌గడ్ వద్ద మావోల దురాగతంలో బలైన సత్తెనపల్లి మండలం గుడిపూడి గ్రామానికి చెందిన సీఆర్‌పీఎఫ్ జవాన్ శాఖమూరి మురళీకృష్ణ విగ్రహానికి శనివారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎస్ఐ అమీనుద్దీన్ మాట్లాడుతూ దేశ వ్యాప్తంగా పోరాటాలలో ప్రాణాలర్పించిన వారి త్యాగాలను గుర్తు చేసుకుంటూ పోలీస్ అమరవీరుల సంస్మరణ దినం ఏటా జరుగుతుందన్నారు. అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ అందరికీ ఆదర్శంగా నిలిచేలా వారి సేవలను కొనియాడారు. తొలుత మురళీకృష్ణ విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ఏఎస్ఐ కరిముల్లా పాల్గొన్నారు.

అంగన్‌వాడీ పోస్టులకు దరఖాస్తులు

ముప్పాళ్ల: మహిళాభివృద్ధి శిశుసంక్షేమశాఖ ఆధ్వర్యంలో సత్తెనపల్లి ప్రాజెక్ట్ పరిధిలో మండలంలో ఖాళీగా ఉన్న అంగన్‌వాడీ కార్యకర్త, సహాయకురాలి పోస్టుల భర్తీకి అర్హులైన వారు దరఖాస్తు చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ అనంతలక్ష్మి శనివారం తెలిపారు. దరఖాస్తులను ఈ నెల 31వ తేదీ సాయంత్రం 5గంటలలోపు సత్తెనపల్లిలోని ఐసీడీఎస్ కార్యాలయంలో స్వయంగా అందించాల్సి ఉందని కోరారు.

పెదకూరపాడు: క్రోసూరు ఐసీడీసీ పరిధిలో పలు అంగన్‌వాడీ కేంద్రాల్లో ఖాళీగా ఉన్న కార్యకర్తలు, సహాయకుల పోస్టుల భర్తీకి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు సీడీపీఓ స్వర్ణకుమారి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. దరఖాస్తులను ఈనెల 31వ తేదీ సాయంత్రం 5 గంటల్లోపు క్రోసూరులోని ఐసీడీసీ కార్యాలయంలో అందజేయాలన్నారు.

బీరవల్లిపాయ రైతులకు విద్యుత్ సరఫరా

రాజుపాలెం: మండలంలోని గణపవరం విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలో గల బీరవల్లిపాయ ఫీడర్ 11కేబీపై అధిక లోడ్ ఉండడం వలన అంతరాయాన్ని సరిచేయడం జరిగిందని విద్యుత్ ఏఈ కేవీ ప్రసాద్ శనివారం తెలిపారు. బీరవల్లిపాయ ఫీడర్‌పై 40 ట్రాన్స్‌ఫార్మర్‌లు ఉండడం వలన విద్యుత్ సమస్యలు ఏర్పడినట్లు చెప్పారు.

సామాజిక తనిఖీ బృందాలకు సహకరించండి: ఎంపీడీఓ

సత్తెనపల్లి: జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం కింద గ్రామాలలో చేపట్టిన పనులపై వచ్చే సామాజిక తనిఖీ బృందాలకు సహకరించాలని ఎంపీడీఓ జీవీ సత్యనారాయణ అన్నారు. పట్టణంలోని ఎంపీడీఓ కార్యాలయ సమావేశ మందిరంలో మండలంలోని సర్పంచులు, ఎంపీటీసీలు, పంచాయతీ కార్యదర్శులు, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు, ఫీల్డ్ అసిస్టెంట్లు, టెక్నికల్ అసిస్టెంట్లు, ఈసీలతో శనివారం నిర్వహించిన కోఆర్డినేషన్ సమావేశం నిర్వహించారు. ఈనెల 28 నుంచి సామాజిక తనిఖీ గ్రామ సభలు నిర్వహించడం జరుగుతాయన్నారు.సమావేశంలో ఏపీడీ పి.వెంకటనారాయణ, ఆర్డబ్ల్యూఎస్ ఏఈ రామ్మోహన్‌సింగ్ పాల్గొన్నారు.

ఆంధ్రా ఫుట్‌బాల్ జట్టుకి ఎంపికైన కౌశిక్‌కు సత్కారం

సత్తెనపల్లి: అండర్ –19 ఆంధ్ర ఫుట్‌బాల్ జట్టుకు సెలెక్ట్ అయిన గంప కౌశిక్‌కు ఏరియా వైద్యశాల అభివృద్ధి కమిటీ డైరెక్టర్ కొత్త రామకృష్ణ ఆధ్వర్యంలో శనివారం సత్కరించారు. వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ బి.లక్ష్మణరావు మాట్లాడుతూ హాస్పిటల్ అభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో అభివృద్ధి కార్యక్రమాలతో పాటు సామాజిక సేవ సేవా కార్యక్రమాలు కూడా ఇక్కడ నిర్వహించడం ఒక శుభ పరిణామం అన్నారు. కౌశిక్‌ను పూలమాలలు, దుశ్శాలువాలతో సత్కరించారు. పీడీ గంప శ్రీనివాసరావు, సురేష్ పాల్గొన్నారు.

ప్రమాదాల నియంత్రణకు చర్యలు

సత్తెనపల్లి: పట్టణంలో ప్రమాదాలు జరిగే ప్రదేశాలను గుర్తించి ప్రమాదాల నియంత్రణకు భారీ కేడ్‌లను ఏర్పాటు చేస్తున్నట్లు పట్టణ సీఐ పి.ప్రభాకరరావు తెలిపారు. పట్టణంలో పలుచోట్ల ఏర్పాటు చేసిన బారీకేడ్లను శనివారం పరిశీలించారు. త్రిబుల్ రైడింగ్ చేస్తున్న యువకులకు కౌన్సెలింగ్ ఇచ్చారు.

నేడు విద్యుత్ సరఫరా నిలిపివేత

అమరావతి: విద్యుత్‌లైన్ల మరమ్మతుల కారణంగా ఆదివారం సరఫరా నిలిపివేయనున్నట్లు విద్యుత్ శాఖ ఏఈ అశోక్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు కరెంట్ ఉండదని చెప్పారు. వినియోగదారులందరూ సహకరించాలని కోరారు.

విద్యుత్ సమస్యలను పరిష్కరించాలి

అమరావతి: విద్యుత్ వినియోగదారుల సమస్యలను సత్వరమే పరిష్కరించాలని ఎంపీపీ మేకల హనుమంతరావు అన్నారు. స్థానిక విద్యుత్ సబ్‌స్టేషన్‌లో సబ్‌స్టేషన్ లెవెల్ అడ్వైజరీ కమిటీ సమావేశంలో శనివారం నిర్వహించారు. ఎంపీపీ మాట్లాడుతూ వినియోగదారులకు నాణ్యమైన విద్యుత్‌తో పాటుగా సత్వర సేవలు అందించటానికి సమష్టిగా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల నుంచి విద్యుత్ సిబ్బంది, రైతులు పాల్గొన్నారు. కార్యక్రమంలో అసిస్టెంట్ ఇంజినీర్ కె.అశోక్ కుమార్, మండల అగ్రికల్చరల్ ఆఫీసర్ అహ్మద్, లైన్ ఇన్‌స్పెక్టర్ పి.శ్రీనివాసరావు పాల్గొన్నారు.

వైద్యులకు సన్మానం

అమరావతి: జగనన్న ఆరోగ్య సురక్ష వైద్యశిబిరాలలో సేవలందించిన వైద్యులను శనివారం సన్మానించారు. మండల పరిషత్ కార్యాలయంలో నిర్వహించిన కార్యక్రమంలో ఎంపీపీ మేకల హనుమంతరావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు.